క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు

కోనేరుసెంటర్: పవిత్ర రంజాన్ పర్వదినం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ముస్లింలకు బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ మచిలీపట్నం శాసనసభ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని, ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిపెద్ద పండుగల్లో ఒకటి అని పేర్కొన్నారు. చెడు భావనలు, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్‌ను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్నారు.

జగనన్నకు సంపూర్ణ మద్దతు తెలపండి



గూడూరు: నిరుపేదల ఆర్థిక స్థితిగతులు మార్చడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలపాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బూరగడ్డ శ్రీకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలో కంకటావలోని రమేష్‌నాయుడుకాలనీ, నందన్‌కాలనీ, కత్తులవానిపాలెం, అంబేడ్కర్ కాలనీల్లో బుధవారం రాత్రి శ్రీకుమార్ పార్టీ శ్రేణులతో కలసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు కొండంత అండగా ఉన్న వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు తెలుపుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట గండ్రం సర్పంచి గుడివాడ వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, మాజీ సర్పంచి బొర్రా దుర్గారావు, కంచర్లపల్లి నాగేంద్రం, కొల్లూరి శివాజీ, బూరగడ్డ భాను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమ తాగునీటి అవసరాలు తీర్చే బావి ఎండిపోయిందని తెలిపారు. శ్రీకుమార్ తన సొంత నిధులతో గురువారం బావిని వెల్లవేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఈద్ నమాజుకు ఏర్పాట్లు పూర్తి

గూడూరు: రంజాన్ పర్వదినం పురస్కరించుకుని గురువారం గూడూరు మండలంలో ఈద్ నమాజుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలకు బుధవారం నెలవంక కనిపించడంతో గురువారం పండుగ జరుపుకోనున్నారు. గూడూరులోని ఈద్గాలో ఉదయం 9 గంటలకు ఈద్ నమాజులు నిర్వహిస్తున్నట్లు హాఫిజ్ షోయబ్ మొహమ్మద్ తెలిపారు. ఆకులమన్నాడు, మల్లవోలు, పోలవరం, పినగూడూరులంక, షా అబ్దుల్లాపాలెం, తరకటూరు గ్రామాల్లో మసీదు కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి.

3.14 ఎకరాల వరికుప్పలు దగ్ధం

పెడన: పంట పొలాల్లోని వరికుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. దూరంగా ఉన్న పంట పొలాల్లో మినుము పొట్టును తగలబెట్టగా ఆ నిప్పు రవ్వలు గాలికి వచ్చి వరికుప్పలకు అంటుకుని అగ్నికి ఆహుతైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రెవెన్యూ, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నూరుకు చెందిన నందూరి తుకారాం మచిలీపట్నంలో ఉంటున్నారు. తనకు చెందిన 3.14 ఎకరాల్లో వరికుప్పలను నూర్చకుండా ఉంచారు. బుధవారం ఉదయం వరికుప్పలకు నిప్పు అంటుకోవడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వచ్చేసరికి 3.14ఎకరాలకు సంబంధించిన రెండు వరికుప్పలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.1.50లక్షలు వరకు నష్టం వాటిల్లి ఉంటుందని సిబ్బంది అంచనా వేశారు.

కోడి పందేలరాయుళ్ల అరెస్ట్

పెడన: బల్లిపర్రు శివారులో కోడిపందేలపై మంగళవారం రాత్రి జరిపిన దాడిలో పది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారంతో బల్లిపర్రు శివారులోని కోడిపందేల రాయుళ్లపై దాడి చేశారు. పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోళ్లు, రెండు కోడికత్తులు, రూ.3,040 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

పెడన: అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక వ్యక్తి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన పెడన పీఎస్ పరిధిలో జరిగింది. పెడన మూడో వార్డు పటమట వీధికి చెందిన ఇద్దం చంద్రశేఖర్(35) చేనేత కార్మికుడు. ఇటీవల అనారోగ్యంతో సతమతమవుతూ మానసికంగా కుంగిపోతున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లోని ఒక గదిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. పక్కనే ఉన్న భార్య ధనలక్ష్మి చూసి పక్కనే ఉంటున్న వారిని పిలిచి హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతదేహాన్ని మచిలీపట్నం ఆసుపత్రిలోని మార్చురీకి తరలించగా అవుట్ పోలీసులు తెలిపిన సమాచారంతో భార్య ధనలక్ష్మి ఫిర్యాదుపై ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతిరహిత పాలన అందిస్తాం

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు, పెడన అభ్యర్థి ఉప్పాల రాము



బంటుమిల్లిలో జరిగిన ప్రజాదీవెనలో ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్, ఉప్పాల రాము

బంటుమిల్లి: నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు అవినీతి రహిత పాలన అందిస్తామని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంటు, పెడన అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర రావు, ఉప్పాల రమేష్(రాము) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బంటుమిల్లిలోని పలు వార్డుల్లో బుధవారం ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ పర్యవేక్షణలో నాయకులు, కార్యకర్తలతో కలసి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ ప్రజా సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చామన్నారు. మమ్మల్ని నమ్మి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టికెట్లు ఇచ్చారన్నారు. ఆయన ఆశయాలు, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే జగనన్న సంక్షేమ పథకాలు అటకెక్కుతాయన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు బటన్ నొక్కి లబ్ధి అందజేశారని చెప్పారు. మా కుటుంబంలో కాంట్రాక్టులు, వ్యాపారాలు లేవని నా తండ్రి సింహాద్రి సత్యనారాయణ సేవలు మెచ్చి నాడు ఎన్టీ రామారావు పిలిచి సీటు ఇచ్చి గెలిపించారన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పేదలకు మంచి వైద్య సేవలు అందించేందుకు మీలాంటి వారు రాజకీయాల్లోకి రావాలని పిలిచి సీటు ఇచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా వారిద్దరూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేస్తూ వైఎస్సార్ సీపీకి ఎందుకు ఓట్లు వేయాలో వివరించారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ఎంపీపీ వి.చినబాబు, జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కె.గంగాధర్, వైస్‌చైర్మన్ పి.బాబూరావు, ఎంపీటీసీలు పి.వీరబాబు, ఎండీ కమాల్‌బాషా, ఎండీ అలీం, సింహాద్రి చంద్రశేఖర్ కుమారుడు రామ్‌చరణ్, వార్డు సభ్యులు భోగిరెడ్డి సూర్యపవన్‌కుమార్, చింతా వెంకటరమణ, కొట్టే వెంకన్న, తట్టా ఆదిలక్ష్మి నాయకులు పట్టపు బుజ్జి, ఎం.నాగేశ్వరరావు, వై.శివ, ఎం.నాగబాబు, ఎం. రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాభవాని జాతర



గారెల దండ, గండుదీపాలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ఎమ్మెల్యే రమేష్‌బాబును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ప్రత్యేక అలంకారంలో గంగభవానీ అమ్మవారు

కోడూరు: కోడూరు గంగాభవాని జాతరకు భక్తజనం పోటెత్తారు. డప్పువాయిద్యాల నడుమ మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, సారె, గాజులను సమర్పించారు. యువకులు డప్పువాయిద్యాలకు అనుగుణంగా కర్రసాము, వీరతాడుతో విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. ప్రత్యేక వాహనాలపై ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ఊరేగించారు. తల్లులు తమ చిన్నారులను ఉయ్యాలలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజు, ధ్వజస్తంభం వద్ద భక్తులు పూజలను నిర్వహించారు.

ఆకట్టుకున్న అమ్మవారి అలంకారం

గంగాభవాని మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అమ్మవారిని అలంకరించి, నిమ్మకాయ మాలలను ధరింపజేశారు. క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. మహిళలు తెచ్చిన నైవేద్యాలను పండితులు రాశిగా పోసి అమ్మవారికి నివేదన చేశారు.

గంగాభవానీ అమ్మవారిని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో పండితులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. పలు పార్టీల అభ్యర్థులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్షేమ సారథిని మళ్లీ ఆశీర్వదించండి



ఓట్లు అభ్యర్థిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కె. కొత్తపాలెం(మోపిదేవి): సంక్షేమ పథకాల సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రమేష్‌బాబు కోరారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో పాటు ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌బాబు, కుమార్తె నిశ్చల, అల్లుడు డాక్టర్ రంగనాథ్, కె. కొత్తపాలెంలో ఎస్సీ కాలనీల్లో బుధవారం సుడిగాలిలా పర్యటించారు. ఇంటింటా కరపత్రాలు అందించి అవనిగడ్డ ఎమ్మెల్యేగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరావుకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. తొలుత గ్రామస్తులు బాణసంచా కాల్చి, పూలు చల్లుతూ అపూర్వ స్వాగతం పలికారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరావు, ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, ఎస్సీ సెల్ మండల పార్టీ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణ చంద్రరావు, మండల యూత్ కన్వీనర్ బచ్చు దిలీప్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుటారం కృష్ణ, అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి, దుట్టా అశ్వినీ కుమార్, మాజీ సర్పంచ్ పాలిమెట్ల వెంకటేశ్వరావు, పలువురు పీఏసీఎస్ చైర్ పర్సన్‌లు, మత్తి రాంప్రసాద్, జంపాన రాంబాబు, పాలిమెట్ల చంటి తదితరులు పాల్గొన్నారు.

సుఖ సంతోషాలతో జీవించాలి



కోనేరుసెంటర్: రంజాన్ పర్వదినం పురస్కరించుకుని జిల్లాలోని ముస్లింలకు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని, అందరిలో కొత్త వెలుగులు రావాలని ఆకాంక్షించారు.

వలంటీర్ల రాజీనామా



గూడూరు: మండలంలోని కోకనారాయణపాలెం సచివాలయంలో ఏడుగురు వలంటీర్లు బుధవారం రాజీనామా లేఖ సమర్పించారు. సచివాలయ కార్యదర్శి రవికిరణ్‌కు రాజీనామా లేఖను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న అడుగుజాడల్లో నిరుపేదలకు సేవలందించాలన్న ఉద్దేశంతో వలంటీర్లుగా పని చేస్తున్నామని వారు తెలిపారు. తమపై ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చేసిన విమర్శలు తమను బాధించాయన్నారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు సచివాలయాలకు చెందిన 99 మంది వలంటీర్లు బుధవారం వరకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారని ఎంపీడీఓ రామకృష్ణరాజు పేర్కొన్నారు. 16 సచివాలయాల పరిధిలోని 21 గ్రామ పంచాయతీల్లో 230 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారన్నారు. వారిలో ఇప్పటికి 99 మంది రాజీనామాలు చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం మల్లేశ్వరం సచివాలయంలో 22 మంది రాజీనామా చేసినట్లు తెలిపారు.

5 శాతం పన్ను రాయితీ పొందండి

మచిలీపట్నంటౌన్: ఆస్తి, ఖాళీస్థలాల పన్ను చెల్లింపుదారులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 5శాతం రాయితీ ఇస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీలోపు చెల్లించే వారికి వర్తిస్తుందని పేర్కొన్నారు. సెలవు దినాల్లోనూ పన్ను చెల్లింపు కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు.

23న లంకమ్మ జాతర

అవనిగడ్డ: లంకమ్మ జాతర మహోత్సవం ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో యార్లగడ్డ వాసు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్ చెప్పారు. ఈ మేరకు స్థానిక ఆలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో వేద పండితులు జాతర మహోత్సవ తేదీని నిర్ణయించారు.

జగనన్న పాలనలో ప్రతి పల్లె అభివృద్ధి

వైఎస్సార్ సీపీ బందరు అభ్యర్థి పేర్ని కిట్టు



ప్రచారం నిర్వహిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: జగనన్న పాలనలో ప్రతి పల్లె అభివృద్ధి చెందిందని, సంక్షేమ ఫలాలు వాడవాడలా అందుతున్నాయని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తెలిపారు. బుధవారం ఆయన మండల పరిధిలోని బొర్రపోతుపాలెం, పిల్లనగోళ్లపాలెం గ్రామాల్లో గడప గడపకు మన సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేర్చిన జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఒక్కసారి అవకాశం ఇస్తే రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొక్కసారి సీఎం అయితే రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల కష్టాలు తీరిపోతాయన్నారు. మనకు సహకారమందిస్తున్న సీఎంకు వచ్చే ఎన్నికల్లో మన వంతుగా బటన్ నొక్కి ఆయనకు సంపూర్ణ మద్దతును తెలియజేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొర్రపోతుపాలెం పార్టీ ఇన్‌చార్జి నట్టే ప్రసాద్, పార్టీ రూరల్ కన్వీనర్ శొంఠి ఫరీద్, బుద్దాల పాలెం మాజీ సర్పంచ్ దండుమోలు బాబురావు, వర్రే వెంకటేశ్వరరావు (కొండలు), వాలిశెట్టి సోమశేఖర్, అరిసెపల్లి పార్టీ ఇన్‌చార్జ్ చండిక అజయ్ కుమార్, బుద్దాలపాలెం సహకార బ్యాంకు అధ్యక్షుడు కొక్కు ఉమామహేశ్వరరావు, సీతారామపురం బ్యాంకు ప్రెసిడెంట్ బెజవాడ సుబ్రహ్మణ్యం, నేతలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని కోనేరుసెంటర్ సమీపంలో ఉన్న దుకాణ సముదాయాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి దుకాణానికి వెళ్లి రానున్న ఎన్నికల్లో తనకు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు ఫ్యాన్ గుర్తు పై రెండు ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. ప్రతి దుకాణానికి వెళ్లి వ్యాపారులను పేరుపేరునా ఆప్యాయంగా పలుకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దేసు వెంకటసుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులు నిండటానికి చర్యలు

గూడూరు: వేసవి తాగునీటి అవసరాలకు కాల్వల ద్వారా నీటిని విడుదల చేసిన నేపథ్యంలో మండలంలోని రక్షిత నీటి పథకం చెరువుల్లో నీరు నింపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ఎస్.ఎస్. శాంతి తెలిపారు. మండలంలోని పలు చెరువులను బుధవారం ఈఓపీఆర్డీ పి.రాజేశ్వరితో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 24 రక్షిత నీటి పథకం చెరువులు ఉన్నాయని వివరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమన్వయం చేసుకుంటూ చెరువులు నిండేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గురువారం కూడా కాల్వలకు నీరు సరఫరా అవుతుందని, ఈలోపు చెరువులను నింపనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ఐ నస్రీన్ ఆరా, వీఆర్వో చలమలశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

కృత్తివెన్ను: తాగునీటి చెరువులు నింపడానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు మండల ఈవోపీఆర్డీ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మండలంలో తాగునీటి చెరువులు నింపుతున్న తీరును క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 16 ఎస్ఎస్ ట్యాంకులు ఉన్నాయని వాటన్నింటిని ప్రస్తుతం వస్తున్న తాగునీటితో నింపుతున్నామన్నారు. అవసరమైన చోట్ల ఆయిల్ ఇంజిన్లు ఉపయోగించి నీటి తోడకం చేపట్టామన్నారు. నీలిపూడి, కొమాళ్లపూడి, మాట్లాం, మునిపెడ పంచాయతీలకు సైతం బ్రాంచి చానల్స్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

కొనసాగిన నీటి తోడకం పనులు

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలకు తాగునీటిని అందించే తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకును నింపే పనులు బుధవారం కొనసాగాయి. బందరు, ఈస్ట్ రైవస్ కాలువకు నీరు విడుదల కావటంతో గత మూడు రోజులుగా చెరువును నింపే పనులు చేపట్టారు. విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడి చెరువును నింపుతున్నారు. ఈ పనులను నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు పరిశీలించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇన్‌చార్జ్ ఎంఈ సాంబశివరావు, ఏఈ సాయిప్రసాద్ ఉన్నారు.

అవనిగడ్డ: దివిసీమలోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు పంటకాలువలకు త్రాగునీటిని విడుదల చేశారు. మోపిదేవి వార్పు వద్ద లాకుల నుంచి బుధవారం సాయంత్రం దిగువుకు నీటిని విడుదల చేశారు. తక్షణమే రక్షిత మంచినీటి చెరువులు నింపుకునేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈ రవికిరణ్ తెలిపారు.

రంజాన్‌కు మసీదుల ముస్తాబు



విద్యుత్ దీపాలతో అలంకరించిన రాజుపేట కొత్త మసీదు

మచిలీపట్నంటౌన్: రంజాన్ పండుగలకు నగరంలోని మసీదులు ముస్తాబయ్యాయి. మసీదులు రంగులతో నూతన శోభను సంతరించుకోగా విద్యుత్‌దీపాలతో అలంకరించారు. నగరంలోని రాజుపేట కొత్తమసీదు, ఇనుగుదురుపేటలోని జామియా మసీదు, టిక్కా మసీదు, సుకర్లాబాద్ మసీద్, ఇంగ్లిషుపాలెం మసీద్, బుట్టాయిపేట మసీదులను ముస్తాబు చేశారు. ఈ నెల 11వ తేదీ గురువారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు ముస్లింలు హాజరుకానున్నారు. నగరంలో ముస్తాఖాన్‌పేటలోని ఈద్గాలో సామూహిక ప్రార్థనల్లో పెద్దఎత్తున పాల్గొననున్నారు. ఈద్గా వద్ద జరిగే ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పనులను మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నాయకులు షేక్ మొహమ్మద్‌సాహెబ్, బాషు బుధవారం పరిశీలించారు. రంజాన్ సందర్భంగా వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



నోబుల్ కళాశాలలోని గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూమ్‌లను కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్డీవో ఎం.వాణి, కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ తదితరులు పాల్గొన్నారు.

పెడన: పెడనలో ఈవీఎంల పంపిణీ కేంద్రంలో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ పలు సూచనలు జారీ చేశారు. బుధవారం రాత్రి ఆయన పెడన మార్కెట్ యార్డులో ఈవీఎంల భద్రపరిచిన గోదాములను, పంపిణీకి చేపట్టాల్సిన చర్యలను ఆయన పరిశీలించి పెడన ఆర్వో వెంకటరమణ నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెడన, బంటుమిల్లి తహసీల్దార్లు కె.రాంబాబు, వై.రవికుమార్, ఆర్ఐ మణికుమార్, వీఆర్వోలున్నారు.

డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఆర్టీసీ డిపోలో ఉన్న ప్రభుత్వ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో శిక్షణ ముగించుకున్న అభ్యర్థులకు బుధవారం ధ్రువపత్రాలను అందజేశారు. 18వ బ్యాచ్‌లో శిక్షణ పొంది ఉత్తీర్ణులైన 15 మందికి ధ్రువపత్రాలు ఇచ్చారు. వీటిని మచిలీపట్నం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిద్ధిఖ్, ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు అందజేశారు. పెద్దిరాజు మాట్లాడుతూ డిపో పరిధిలో కళాశాల ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పటి వరకు 18 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వగా 292 మంది శిక్షణ పొంది ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు పొంది ఉపాధి పొందుతున్నారన్నారు. 19వ బ్యాచ్ శిక్షణ బుధవారం ప్రారంభమైనట్లు తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు హెవీ డ్రైవింగ్ శిక్షణ పొందవచ్చునని ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న ప్రవచనం

మచిలీపట్నంటౌన్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని చిలకలపూడి శ్రీ విజయ సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. 'శ్రీరామనవమి పండుగ ప్రాశస్త్యం'పై వెంకటేశ్వరరావు చేసిన ప్రవచనం భక్తులకు పలు విషయాలను తెలిపింది. కార్యక్రమాన్ని టీటీడీ ప్రతినిధి తురగా ప్రసాద్ పర్యవేక్షించారు.

చెన్నూరు అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవం

పెడన: మేజర్ పంచాయతీ చెన్నూరు అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ కల్పవల్లి, అంగన్ వాడీ వర్కర్లు పార్వతి, గీత, సుజాత, విజయలక్ష్మి, వాణి, బేబి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు బందరు రూరల్ ఎస్సై చాణక్య

కోనేరుసెంటర్: బందరు రూరల్ ఎస్సై–1 చాణక్యను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల బందరు మండలం ఉల్లిపాలెం గ్రామంలో జరిగిన ఓ జాతరలో వైఎస్సార్ సీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరగ్గా పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు చేశారు. గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఎస్ఐ చాణక్య డిశ్చార్జ్ చేయించి విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి టీడీపీ సానుభూతిపరుడి ఎదుట విచక్షణారహితంగా కొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడి మళ్లీ ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఎస్సై తీరును తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకుని రంగంలోకి దిగిన బందరు డీఎస్పీ సుభాని ఎస్పీ ఆదేశాల మేరకు జరిగిన సంఘటనపై విచారణ చేశారు. ఎస్సై చాణక్యపై వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేలడంతో సదరు నివేదికను జిల్లా ఎస్పీకి అందజేయగా ఆయన్ను వీఆర్‌లో పెడుతూ ఆదేశాలిచ్చారు. రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐగా ఆర్‌పేట ఎస్ఐ వీరప్రసాద్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



41వ డివిజన్‌లో కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు

మచిలీపట్నంటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ను గెలిపించాలని కోరుతూ నగరంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని ఓటర్లకు కరపత్రాలు అందజేశారు. అభ్యర్థుల ఫొటోలతో పాటు సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మచిలీపట్నానికి వచ్చిన నూతన ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల ఫొటోలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేస్తున్నారు. 41వ డివిజన్‌లో మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ముస్లింల ఉపవాసాలు ఆదర్శనీయం



చల్లపల్లిలో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రమేష్ బాబు, రామ్‌చరణ్

చల్లపల్లి: రంజాన్ నెలలో ముస్లింలు కఠిన నియమాలతో పాటించే ఉపవాస దీక్షలు ఆదర్శనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. స్థానిక మసీదులో బుధవారం సాయంత్రం రంజాన్ నెల చివరి రోజు ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రమేష్‌బాబు, మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు తనయుడు రామ్‌చరణ్ విచ్చేసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం షాదీఖానాలో ఆత్మీయ విందును ప్రారంభించారు. ముస్లిం పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.